# గమ్యం




-ఎమ్. పి. ఆర్. రాధాకృష్ణ

"నమస్తే!"

దీక్షగా కళ్లద్దాల చాటునుండి దినపత్రిక చదువుకుంటూన్న పరమేశ్వర శాస్త్రి తల ఎత్తి చూశాడు.

"నమస్కారం!" అవతలి వ్యక్తి మళ్లీ అన్నాడు.

"నమస్కారం. . . నమస్కారం" అంటూ తడబడ్డాడు శాస్త్రి.

పొడుగైన విగ్రహం. ఖరీదైన సూటులో హుందాగా నిలబడి ఠీవిగా నవ్వుతున్నా డా యువకుడు. చేతిలో బ్రీఫ్-కేసు. వేళ్లమధ్య ఆహుతయి పోతున్న ఫిల్టరు సిగరెట్టు. మెల్లగా నవ్వుతూ పరమేశ్వరశాస్త్రినే చూస్తున్నా డతను.

"తమరూ. . . తమరూ. . ." అంటూ నసిగాడు శాస్త్రి.

ఆ వ్యక్తి గట్టిగా నవ్వాడు.

"ఎవరో చెప్పుకో చూద్దాం!"

గోపీ చప్పరించేశాడు.

"ఎంతో లేదు. . . మహా ఉంటే ఓ ఏభై లక్ష లుంటుందేమో? అంతే!" అన్నాడు యాథాలాపంగా.

శాస్త్రి గుండెలు జల్లుమన్నాయి.

రంగమ్మ మరి నిలబడలేక కుప్పలా కూలిపోయింది!

"ఏభై లక్షలే!" అన్నాడు శాస్త్రి, గుండెలమీద చేయి పెట్టి.

"అయితే, ఇంత కాలానికి గుర్తుకు వచ్చామన్న మాట ... లక్షాధికారివి. . . నీకేం? ఇప్పటికయినా మేమంటూ ఉన్నామని ఆమాత్రం వచ్చావు. అదే పది వేలు!" అంది రంగమ్మ నిష్ఠూరంగా.

గోపీ ఇబ్బందిగా కుర్చీలో కదిలాడు.

"అదేం మాట, అత్తయ్యా! ఆ రోజు ఇల్లు విడిచిపోయినప్పుడు బాగా అభివృద్ధిలోనికి వస్తేగాని తిరిగి మిమ్మల్ని చూడకూడ దనుకున్నాను. ఇంత కాలం మిమ్మల్ని తలవని రోజు లేదు. ఎప్పుడు వచ్చి వాలదామా అని ఒక్కటే ఆత్రత. కానీ, నా లక్ష్యం నన్ను వెనక్కి లాగేది. బాగా డబ్బు సంపాదించాలి. అదే నా ఆశయం! ఈనాడు నా ఆశయం నెరవేరింది. అందుకే నా కెంతో పూజ నీయులైన మిమ్మల్ని చూడటానికి వచ్చాను. ఇక నా జీవితాంతం మీ సేవ చేసి తరిస్తాను!" అన్నాడు ఆవేశంగా.

గోపీ మాటలకు రంగమ్మ చాలా సంతోషించింది.

"మా బాబే! మేమంటే నీ కెంత అభిమానంరా! నాకు మాత్రం తెలీదూ ... ఏదో మాట వరస కన్నాను. మరేం అనుకోకు!" అంది ఆప్యాయంగా.

"ఇంతకూ నువ్వొక్కడివే వచ్చావేం? అమ్మాయినీ, పిల్లలనూకూడా తీసుకొని రావలసింది" అన్నాడు శాస్త్రి, ఏదో కూపీ లాగే ధోరణిలో.

"అమ్మాయెవరు?" తెల్లబోతూ అడిగాడు గోపీ.

శాస్త్రికి అర్థమయింది. అయినా, తెలియనట్లే అన్నాడు: "నీ భార్యా, పిల్లలూ. . ."

గోపీ గట్టిగా నవ్వేశాడు.

"చంపావ్ పో, మామయ్యా! నా కింకా పెళ్ళే కాలేదు!" అన్నాడు నవ్వాపుకుంటూ.

రంగమ్మ కళ్ళు మెరిశాయి.

"బాగానే ఉంది మీ తెలివి . . . వాడికి పెళ్ళయితే మనల్ని పిలవకనే పోయాడా? ఏదో సామెత చెప్పినట్లు నా రాతకొద్దీ దొరికారు" అని రుసరుస లాడింది.

"నీ కోపతాపాలు తరవాత తీరుబడిగా ప్రదర్శిద్దువుగాని. . . అల్లుడు రాకరాక వచ్చాడు. వంట ప్రయత్నాలేమైనా చేస్తావా, లేదా?" అంటూ తిరిగి భార్యను దబాయించబోయాడు శాస్త్రి.

"ఆమాత్రం నాకు చెప్పాలేమిటి? అదింకా రాలేదేమని చూస్తున్నా?" అంది రంగమ్మ.

"అదెవరు?" ఆశ్చర్యంగా అడిగాడు గోపీ.

రంగమ్మ చేత్తో నుదుటిమీద కొట్టుకుంది. "నా తెలివి తెల్లారిపోనూ... ఇంతసేపూ నీ సంగతి వినటమే కాని, మా గొడవలేం చెప్పలేదు కదూ? నువ్వెళ్ళిన రెండేళ్ళకు కలిగింది సుబ్బలక్ష్మి. లేకలేక కలిగిందంటూ అతి గారాబం చేశారు మీ మామయ్య. తెల్లారితే ఊరు చక్కబెట్టడానికి పోతుంది. ఏమయినా అంటే ఈయనగారు ఊరుకోరు. ఇదీ వరస!" అంటూ ఫిర్యాదులా చెప్పింది.

గోపీ నవ్వాడు. "పెళ్ళి చేసేస్తే సరి!" అన్నాడు నవ్వుతూనే.

"చేసేద్దామనే అనుకుంటున్నాం, బాబూ. రెండు మూడు సంబంధాలు కూడా చూశారు మీ మామయ్య. అదేం చిత్రమో? ఏదీ ఇష్టపడలే దా పిల్ల. అయినా మన తాపత్రయమేగాని . . . ఏది, ఎక్కడ రాసి పెట్టి ఉందో?" గుంభనంగా అంది రంగమ్మ.

ఇంతలో రానే వచ్చింది సుబ్బలక్ష్మి.

"ఏమే, ఊరంతా తిరిగి ఇప్పుడా రావటం!" కూతుర్ని నిలదీసింది రంగమ్మ.

"ఊరంతా ఏం తిరగలే! రాముడమ్మ గారింట్లో గచ్చపిక్కలాడుకుంటూ ఉండి పోయాను. ఏం, తప్పా?" అంటూ తిరిగి తల్లినే నిలదీసిం దా పిల్ల.

గోపీ కిసుక్కున నవ్వాడు.


అంతవరకూ తల్లితో వాదం పెట్టుకొన్న సుబ్బలక్ష్మి గోపీ నవ్వటంతో అటు చూసి, కొత్త వ్యక్తి కనిపించగానే కంగారుపడింది.

"అలా చూస్తావేమే! మీ బావ. . . గోపీబావ." చెప్పింది రంగమ్మ.

ఆ పే రెప్పుడూ ఆ పిల్ల విన్నట్లు లేదు. తెల్లబోయి చూసింది తల్లివైపు.

"నువ్వింకా అప్పటికి పుట్టలేదులే నీకు తెలియటానికి! మనం అప్పుడప్పుడు అనుకుంటూ ఉంటామే. . . గోపీబావ . . . ఆ బావే వీడు!"

తల్లి మాట్లాడుతున్న దేమిటో సుబ్బలక్ష్మికి అర్థం కాలేదు. కానీ, 'బావ'



Grant 258. 72

అనగానే ఎందుకో సిగ్గు వేసి తుర్రున లోనికి పారిపోయింది.

"పిచ్చి తల్లి... ఎంత సిగ్గో దానికి ... 'బావంటే ఎవరే' అని అడిగేది... అంతవరకూ ఎందుకు? మొన్నటికి మొన్న 'బావ మనింటికి రాడేమమ్మా' అని అడిగింది. ఏమిటో దాని మనసు... ను వ్వెప్పటికయినా వస్తావనే దాని నమ్మకం. ఏమిటో అంతా లీల!"

తనలో తాను అనుకుంటున్నట్లు అనేసి లోపలికి వెళ్ళిపోయింది రంగమ్మ.

మధ్యాహ్నం భోజనాల దగ్గర ఏర్పాట్లు చూసి ఆశ్చర్యపోయాడు గోపీ. అవ పెట్టిన పనసపొట్టుకూర, గుత్తి వంకాయ వేపుడు, నగ్గు వడియాలు, నువ్వుపప్పు అప్పడాలు, కొబ్బరికాయ పెరుగుపచ్చడి, మెంతిపులుసు, మైసూరు పాకులు, పక్కనే పాయసం. రంగమ్మ చాలా ఆర్భాటంగా చేసింది.

"ఇవన్నీ ఎందు కత్తయ్యా? అనవసరంగా చాలా శ్రమ తీసుకున్నావు. నీ చేత్తో పెట్టేడు పచ్చడి మెతుకులు చాలు. అమృతంలా ఉంటుంది నాకు" అన్నాడు గోపీ ఆప్యాయంగా.

రంగమ్మ మేనల్లుడి అభిమానానికి తబ్బిబ్బయిపోయింది.

"శ్రమేముందిరా ఇందులో... ఎవరో పరాయి వాడికోసం చేశానా ఇదంతా! మాట్లాడకుండా తిను!" అని చనువుగా కోప్పడింది.

అందరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. భోజనాలయాక గోపీ కోసం మేడమీద గదిలో పక్క ఏర్పాటు చేయించింది రంగమ్మ.

"ఎప్పుడనగా రైలెక్కావో ఏమో ... కాస్త నిద్రపో, బాబూ... మేడ మీది గదిలో నీకు పక్క ఏర్పాటు చేశాను!" అంది రంగమ్మ.

గోపీ మేడమీదకు వెళ్ళిపోయాడు. ఇక నిద్ర పోదామనుకుంటూ ఉండగా గుమ్మందగ్గర గాజుల చప్పుడు వినిపించింది.

"ఎవ రది??" అన్నాడు లేచి కూర్చుంటూ.

"వక్కపొడి... అమ్మ ఇమ్మంది."

అది సుబ్బులు కంఠస్వరమని పోల్చుకున్నాడు గోపీ.

"బయటనే నిలబడిపోయావేం? లోపలికి రా!"

సుబ్బులు నేలచూపులు చూస్తూ నెమ్మదిగా వచ్చింది.

"కూర్చో!"

కూర్చుంది బుద్ధిగా.

సుబ్బులక్ష్మి ఇచ్చిన వక్కపొడి అందుకొని నోట్లో వేసుకున్నాడు.

"ఏమైనా చదువుకున్నావా?"

సుబ్బులక్ష్మి సిగ్గుపడింది.

"పర్వాలేదు, చెప్పు!" నవ్వుతూ అడిగాడు.

"అయిదో క్లాసు!"

"భేష్! బాగానే ఉంది... అదిసరే ... నాతో మద్రాసు వచ్చేస్తావా?"

సుబ్బులక్ష్మి తల ఎత్తి చూసింది. ఆ పిల్ల కండ్లు మెరుస్తున్నాయి.


"అంటే నాతో వచ్చేయటం నీ కిష్టమేగా?" అన్నాడు కవ్వించే ధోరణిలో!

ఆ పిల్ల బోలెడంత సిగ్గు పడి పోయింది. "ఛీ... పో..." అంటూ పారిపోయింది. తన మాటలన్నీ తూ. చ. తప్పకుండా తల్లితో చెబుతుందని గోపీకి తెలుసు. అందుకే తృప్తిగా నవ్వుకొని నిద్రకు ఉపక్రమించాడు.

* * *

వేణు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు చుట్టూ చేరిన వాళ్ళు వాళ్ళకు తోచిన విధంగా సానుభూతి చూపించారు

ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే
టూత్ పేస్ట్ — నీమ్
నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను
శుభ్రపరచడమే గాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య
ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ
వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్ష
ణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని
సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి

"మీ వా ళ్ళెవరూ లేరా?" అడిగా రెవరో.

"లేకేం. . . మేనమామ ఎవరో ఉండాలి. . . ఇంత జరిగినా ఇంకా రానే లేదు!" అన్నా రింకెవరో.

మాటల్లోనే ఊడిపడ్డాడు ఆ మేనమామ.

"ఎంత పని జరిగిపోయింది. . . ఈ దుర్వార్త నా కిప్పుడే తెలిసింది. . . వెంటనే వచ్చేశాను!" అన్నాడు వస్తూనే, తన ఆలస్యానికి సంజాయిషీ ఇచ్చే ధోరణిలో.

"ఏడవకు, బాబూ! మీ నాన్న నీకు అన్యాయం చేశాడు. . . చిన్న కుర్రాడివి నువ్వు. . . నిన్ను వదిలేసి తన దారి తను చూసుకున్నాడు మీ నాన్న. . . ఇదిగో, మీ మామయ్య వచ్చాడు. ఆయనతో వెళ్ళిపోయి బుద్ధిగా చదువుకో. నువ్వు చాలా గొప్పవాడివి కావాలి. . . మీ నాన్న దేశభక్తుడు. తన సర్వస్వం దేశం కోసం ధారపోసిన మహనీయు డాయన. ఆ తండ్రిపేరు నిలబెట్టాలి" అన్నాడు పక్కింటి ముసలాయన, వేణును సాగ నంపుతూ.

మామయ్య చేయి పట్టుకొని ఆ ఇంటినుండి బయటకు నడిచాడు వేణు!

మామయ్య భార్య వేణును చూడగానే ముఖం చిటపట లాడించింది.

"వెధవసంత . . . వెధవసంత!" అంటూ విసుక్కుంది.

"ఊరుకో. . . ఊరుకో!" అంటూ సర్ది చెప్పబోయాడు మామయ్య.

"ఊరుకోక చేసే దేముంది? గ్రహచారం. . . అడ్డమైన వాళ్ళకూ చాకిరీ చేసి పెట్టమని నా నుదుట వ్రాసి పెట్టి ఉంది. తప్పుతుందా?" గొణిగింది అత్తమ్మ.

వేణుకు ఆ వాతావరణం నచ్చలేదు. ఆ వాతావరణం నచ్చక పోవటమే కాకుండా తనకు నచ్చని పనులు చాలా చేయవలసి ఉంటుందని కొద్ది రోజుల్లోనే గ్రహించాడు వేణు. పుస్తకాల సంచి తగిలించుకొని బయటకు వెళ్ళబోతున్న వేణుతో, "ఎక్కడికి?" అంటూ అటకాయించింది అత్తమ్మ.

"బడికి" అన్నాడు అమాయకంగా.

*అత్తమ్మ విరుచుకుపడింది.*

"ఓహో దొరగారు చదువులు చదివి ఊళ్ళేలుతారు కాబోలు! దొరబాబులా కాలుమీద కాలు వేసుక్కూర్చుంటే చేసి పెట్టడానికి నా కేం పది చేతులు, పది కాళ్ళూ లేవు! నువ్వు బడికి వెళితే ఇంటి పనెవరు చేస్తారనుకున్నావ్!"

వేణు చిత్తరపోయాడు.

"అలా ముంగిలా చూస్తావేం. . . నడు నడు" అంటూ పుస్తకాల సంచి లాక్కొని గిరాటువేసి వేణుని పెరటి లోనికి తోసింది. ఆ నాడే వేణు జీవితం అనుకోని విధంగా దిగజారిపోయింది. ఉదయం లేచి గొడ్లకు కుడితి పెట్టి, గడ్డి వేసి, ఆ పైన అంట్లు తోమేవాడు. నీళ్ళు తోడిపెట్టి బట్టలు ఉతికేవాడు. బజారు పని చేసేవాడు. అత్తమ్మకు వంటలో సాయం చేసేవాడు. చేయలేని, చేయరాని పనంటూ లేకుండా అన్నీ చేసే వాడు.

ఎన్ని చేసినా అత్తమ్మ చేతిలో దెబ్బలు తప్పేవి కావు. గొంతెత్తి తిడుతూ, గొడ్డును బాదినట్లు బాదేది. అప్పు డప్పుడూ మామయ్యకూడా అత్తమ్మకు సాయం వచ్చి మరి నాలుగు తగిలించే వాడు.

పొట్టకూటి కోసం ఆ బాధలన్నీ భరించాడు వేణు. తన దుస్థితికి కుళ్ళి కుళ్ళి ఏడ్చేవాడు. అరణ్య రోదనంలా అతని ఏడుపు వినేవాళ్ళే లేకపోయారు.

కానీ, ఒక రోజు వేణుకు జ్ఞానోదయ మయింది, గొడ్లసావిట్లో పడుకొని తన కష్టాలను గట్టెక్కించమని దేవుడి గురించి ఆలోచిస్తున్నప్పుడు తొలి కోడి కూసిన కొద్దిసేపట్లో వేణుకు కర్తవ్యం స్ఫురించింది. *తన నెవరూ కాపాడలేరు,* కాపాడరు. తనను తానే కాపాడుకోవాలి. ఈ నీచమైన బ్రతుకునుండి విముక్తి పొందాలి. వేణు ఒక నిర్ణయానికి వచ్చాడు.

చీకటి దట్టంగా వ్యాపించి ఉంది. చుక్కలు నిర్జీవంగా వెలుగుతున్నాయి. ఆ వెలుగులో దారి చూసుకుంటూ బయట పడ్డాడు. బానిసత్వం నుండి విముక్తి పొందినట్లు కాలి సత్తువ కొద్దీ పరుగు తీశాడు.

* * *

లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు గోపీ.

"లేచావా. . . ఇది నాలుగో సారి రావటం. నిద్ర పోతున్నావని లేపలేదు. కాఫీ తెస్తానుండు!" అంటూ హడావుడిగా వెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.

కాస్సేపటిలో కాఫీగ్లాసుతో ప్రత్యక్ష మయింది.

"పాపం. . . నువ్వే వచ్చావా? నేనే దిగి వచ్చేవాడినిగా!" అన్నాడు గోపీ, కాఫీ గ్లాసు అందుకుంటూ.

సుబ్బలక్ష్మి బుగ్గలు సొట్టపడేలా ముద్దుగా నవ్వింది.

"నవ్వితే నువ్వు చాలా బాగుంటావు!" అన్నాడు గోపీ, తదేకంగా చూస్తూ.

ఆమె సిగ్గు పడింది. సిగ్గుపడి— "మీకు మాటలు బాగా వచ్చు!" అంది మెల్లగా గొంతు పెగుల్చుకొని.

"నిజమే మరి. . . అందాల బొమ్మను ఎదురుగా పెట్టుకొని నోరు మూసుకోవటం ఎలా?"

"ఛీ. . . పోదురూ. . . అన్నీ పోకిరి మాటలు!" సుబ్బలక్ష్మి చిరుకోపం ప్రదర్శించింది.

గోపీ నిండుగా నవ్వాడు.

"ఇంత అందమైన అత్త కూతు రుందని తెలిస్తే ఏ నాడో వచ్చి ఉండే వాడిని!"

సుబ్బలక్ష్మి నవ్వుకుంటూ తుర్రు మంది.

కాస్సేపటిలో శాస్త్రి మేడమీదకు వచ్చాడు.

"ఏరా, అల్లుడూ. . . బాగా నిద్ర పట్టేసినట్లుందే!" అన్నాడు వస్తూనే. తరవాత గోపీని పరీక్షగా చూశాడు.

"అభిమానం కొద్దీ అంటున్నానని అనుకోకపోతే ఒక్క మాట. నువ్వు బాగా చిక్కిపోయావు సుమీ! ఎంత డబ్బుంటే నేంగాక. . . ముఖం ఉండద్దూ. . . నా మాటవినిఒకఇంటివాడవయ్యావంటే'...' శాస్త్రి మాట పూర్తి చేయకముందే అప్పుడే వచ్చిన రంగమ్మ అందుకొంది:

"తగిన పిల్ల దొరికితే వాడు మాత్రం చేసుకోడటండీ. . . అంత పెద్ద పట్టణాలన్న మాటేగాని అక్కడి ఆడ పిల్లలు మన పల్లెటూరి పిల్లల్లాగా ఉంటారా ఏమన్నానా? మన అమ్మాయిని చెప్పుకోవటం కాదుగానీ. . . మన సుబ్బుల్ని చూడండి, దాని అందం, అణకువ అందరికీ ఉమ్మంటే మాత్రం వస్తాయా?"


గోపీ నవ్వి ఊరుకున్నాడు.

చల్లకు వచ్చి ముంత దాయటం అనవసర మనిపించింది రంగమ్మకు. అందుకే అసలు విషయం సూటిగా అడిగేసింది.

"మన సుబ్బుల్ని చూశావుగా. . . అయిదో క్లాసు ఫస్టుగా పాసయింది. దాని అందచందాలు, గుణగణాలు నువ్వే చూస్తున్నావు. ఏమంటావు?"

గోపీ వెంటనే మాటాడలేదు. రంగమ్మ గోపీ మౌనంతో కొంచెం నిరుత్సాహ పడింది. అయినా, పూర్తిగా తేల్చుకొనిదే వదలకూడదని నిశ్చయించుకుంది.

"నువ్వా స్థితిమంతుడివి. . . నీతో తూగలేకపోయినా, మాకూ ఏదో కాస్త దేవు డిచ్చాడు. దాని బాలతొడుగు, నా ఒంటిమీద ఉన్నదీ, ఇనప్పెట్టెలో ఉన్నదీ-



అంతా కలిపి నూరు తులాల బంగారం ఉంది. ఇంటిలో వెండి సామానంతా కలిపితే పది వేలకు తక్కువ ఉండదు. రొక్కం ఈ పట్నన పాతిక వేలుంది గుడ్డిలో మెల్లలాగా ఓ పదిహేనెకరాల పల్లం ఉంది. ఇదంతా ఎందుకు. చెబుతున్నానంటే. . . ఎటొచ్చీ ఈ ఆస్తి అంతా పిల్లదే మరి!" గుక్క తిప్పుకోకుండా చెప్పింది రంగమ్మ.

"నీ కేమయినా మతి పోయిందటే! వాడి కున్న ఆస్తిలో వందో వంతుకూడా ఉండదు మనది. ఈవివరాలన్నీ ఎందుకు?" అన్నాడు శాస్త్రి కోప్పడే ధోరణిలో.

గోపీ అందుకొని అన్నాడు: "ఆస్తి పాస్తుల దేముందిలే, అత్తయ్యా!! మనుషులు ముఖ్యంగాని, డబ్బు చూసు కుంటామా? నిజం చెప్పాలంటే మద్రాసులోనే చాలామంది నా చుట్టూ తిరిగారు లక్షలు గుమ్మరిస్తామని. కానీ, నేను అంగీకరించలేదు. డబ్బుతోనే అన్నీ ముడిపెట్టుకుంటే జీవితంలో ఏదీ అనుభవించలేం. అదీకాక సుబ్బులు ఉంటుండగా నే నింకెవరినో మాత్రం ఎలా చేసుకుంటాను? మీ రింతగా చెప్పాలా!" అన్నాడు.

శాస్త్రి, రంగమ్మ ఎగిరి గంతేసినంత పని చేశారు.

"మా నాయనే. . . మా తండ్రే ... నాకు తెలుసు నువ్విలా అంటావని" అంటూ మహదానందపడిపోయింది రంగమ్మ.

సుబ్బులక్ష్మి గోపీ కనిపిస్తే చాలు, సిగ్గుపడి తప్పుకుంటూంది.

"అదేమిటే చోద్యం! కాబోయే మొగుడే కదా? మరి అంత సిగ్గేమిటి?" అని మందలిస్తున్నట్లు సంబరపడింది రంగమ్మ. సిగ్గులు మొగ్గలు తొడగగా సుబ్బులక్ష్మి ముసిముసి నవ్వులు నవ్వు కుంది.

• • •

చీకటిలో కలిసిపోయిన వేణు వెలుగు కనిపించిన చోట ఆగాడు. అది రైల్వే స్టేషను. బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న ఎక్స్‌ప్రెస్ బండి లోనికి గభాల్న ఎక్కేశాడు. బండి కూత వేసి కదిలాక తృప్తిగా ఊపిరి పీల్చుకొని చుట్టూ చూశాడు. ఆ కంపార్ట్‌మెంటులో ఉన్న ఒకే ఒక వ్యక్తి వేణువైపు సూటిగా చూస్తున్నాడు.

"ఏయ్. . . ఎవరు నువ్వు?" గద్దించి అడిగాడు ఆ వ్యక్తి.

"నేను. . . నేను. . ." వేణు తడబడ్డాడు.

"ఇది ఫస్ట్ క్లాసు కంపార్ట్‌మెంటు— తెలుసా?"

తెలియదన్నట్లు తల ఊపాడు వేణు.

ఆ వ్యక్తి వేణును ఆపాదమస్తకం పరిశీలించాడు.

"ఏదైనా దొరికితే కొట్టేసి పారి పోదామనుకుంటున్నావు కదూ?"

"అబ్బే, లేదండీ. . . లేదండీ. . ." భయంగా చెప్పాడు.

"ఇంట్లోంచి పారిపోయి వచ్చావా?" వేణు మాట్లాడలేదు.

"గుడ్. మరేం భయం లేదు. . . నేనున్నాను నీకు. . . నాతో వచ్చేస్తావా?" అడిగా డా వ్యక్తి.

అనుకోని ఆహ్వానానికి వేణు ఆశ్చర్య పోయాడు.

"అలాగే!" అన్నాడు ఆనందంగా. బండి మద్రాసు సెంట్రల్ చేరింది.

ఆ వ్యక్తితోబాటు బయటపడ్డాడు వేణు. అతనితోబాటు కారులో కూర్చు న్నాడు.

కొద్ది సేపట్లో వాళ్లొక పెద్ద భవంతి ముందు ఆగారు.

"ఇదే మన ఇల్లు!" అన్నా డా వ్యక్తి నవ్వుతూ.

అంత పెద్ద ఇల్లు వేణు ఎప్పుడూ చూడలేదు. ఆ ఇంటి నిండా రకరకాల వ్యక్తు లున్నారు. వాళ్లందరితో "మన కొత్త మెంబరు" అంటూ పరిచయం చేశాడు వేణుని.

అనుకోని ఈ ఆతిథ్యానికి, ఆ వ్యక్తి మంచితనానికి ఆశ్చర్యపోతూ వారం పైగా గడిపేశాడు. మంచి భోజనం, మెత్తటి పరుపులు, రంగు రంగుల ఖరీదైన బట్టలు —వేణుకు అంతా కలలా అనిపించింది.

కానీ, ఒక రోజు వేణు రంగుల కలలన్నీ కరిగిపోయాయి.

ఆ రోజు వేణును ఆ వ్యక్తి ఒక భూగృహానికి తీసుకొని వెళ్లాడు. వేణు అయోమయంగా చూశాడు.

"ఈ నాటినుండి నీకు ఇక్కడ శిక్షణ ఇస్తాం!" అన్నా డా వ్యక్తి. వేణుకు అర్థం కాలేదు.

"కుర్రాడు, బాస్. . . అర్థమయేలా చెప్పండి!" అన్నా రెవరో.


అందరూ నవ్వారు. బాస్‌కూడా నవ్వాడు. నవ్వి అన్నాడు: "అర్థం కాలేదా? గోడలు దూకటం, కన్నాలు వేయటం, ఇనప్పెట్టెలు పగలకొట్టడం, సరదాగా జేబులు కత్తిరించడం— భలే గమ్మత్తుగా, ఖుషీగా ఉంటుందిలే. . . చూస్తావుగా నువ్వే!"

"అంటే. . . అంటే. . దొంగతనమా?"

వేణు విభ్రాంతపోతూ అడిగాడు.

బాస్ నవ్వాడు.

"నో, నో. . . దొంగతనం కాదు; దొరతనం. ఈ రోజుల్లో ఎవడు ప్రజ లను ఎక్కువగా దోచుకుని తింటాడో



వాడే దొర. కొందరు అధికారంలోనికి వచ్చి బందిపోటుదొంగల్లా దేశసేవ చేస్తూ ఉంటారు. మన కా అధికారాల ప్రసక్తి లేదు. మనది నిఖార్సయిన దేశసేవ. ఉన్నవాళ్లను దోచుకుంటాం. ఆ విధంగా సమానత్వాన్ని సాధించుతాం!" అన్నాడు.

ఆ మాటలు వేణుకు అర్థం కాలేదు. మరోసారి వేణు విధి చేతిలో ఓడి పోయాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది. వేణు పేరు దేశం నలుమూలలా వ్యాపించి పోయింది. డబ్బున్న వాళ్ల గుండెలలో గుదిబండలా తయారయాడు. ఎన్నో దొంగతనాలు చేశాడు. దారులు కాసి దోపిడీలు సాగించాడు. హత్యలు చేశాడు. అన్ని విద్యలలో సిద్ధహస్తుడయి, చివరకు ఆ ముఠాకు తనే బాస్ కూడా అయాడు!

* * *

రైలు వేగంగా పోతూ ఉంది.

తను కూర్చున్న మొదటి తరగతి పెట్టెలో బ్రీఫ్ కేసు తెరిచాడు.

నూరు తులాల బంగారం తళతళ మెరిసింది.

బ్రీఫ్ కేసు అరల్లో కుక్కిన కరకు నోట్లు ఫెళఫెళలాడుతూ నవ్వాయి.

పక్కనే ఉన్న వెండిసామాన్ల మూట గలగలమంటూ అతన్ని పలకరిస్తున్నాయి.

సంతోషం పట్టలేక గట్టిగా నవ్వాడు.

"వెధవసంత. . . వెధవసంత!"

. . . చాలా సంవత్సరాల క్రితం తనను చూసి విసుక్కున్న అత్తమ్మ ముఖం అతనికి గుర్తు వచ్చి పళ్లు బిగించాడు కోపంగా.

"అంతా కలిపి నూరు తులాల బంగారం ఉంది. వెండిసామానంతా కలిపితే పది వేలకు తక్కువ ఉండదు. రొఖ్ఖం ఈ పట్టున పాతిక వేలవరకూ ఉంటుంది."

ఆ అత్తమ్మ మాటలే. . . తను గొప్పవాడి వనుకొని, తనను అల్లుడిగా కొట్టేయాలని ఉచ్చులు బిగిస్తున్న ఆవిడ మాటలు గుర్తు వచ్చాయి.

గట్టిగా. . . దద్దరిల్లిపోయేలా నవ్వాడు.

'తెల్లవారగానే తెలుస్తుంది. లబో దిబో అంటూ గోల పెడతారు పిచ్చి సన్యాసులు!' అనుకున్నాడు. అలా అనుకో గానే అతనికి ఎక్కడలేని సంతోషం కలిగింది.

తన ఆచూకీ వాళ్లకు దొరకదని అతనికి బాగా తెలుసు.

అందుకే గుండెలమీద చేతులు వేసు కొని నిద్ర పోవటానికి ఉపక్రమించాడు— వేణుగోపాల్!

ఆ చీకటిని చీల్చుకుంటూ రైలు బండి గమ్యం వైపు శరవేగంగా దూసు కొని పోసాగింది.


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# పరీధావి దీపావళి కథల పోటీ

ప్రతి సంవత్సరంవలెనే ఈ పరీధావి దీపావళి సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తూంది.

విరోధికృత్ దీపావళి కథల పోటీలో 5,000 రూపాయల బహుమతులు అందజేశాము. రచయితలకు, రచయిత్రులకు ప్రోత్సాహం కలిగించాలనే సంకల్పంతో ఈ సంవత్సరం కూడా దీపావళి కథల పోటీలో మొత్తం 5,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకోవలెననీ, పాఠకులకు ఉత్తమమైన కథలు అందజేయాలనీ, మా కృషి విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలని కోరుతున్నాము.

## మొదటి బహుమతి రు. 2,500
## రెండవ బహుమతి రు. 1,800
## మూడవ బహుమతి రు. 700

### దీపావళి కథల పోటీ నిబంధనలు:

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయ రచనలేకాని, అనువాదాలు పంపరాదు.
3. రచన అరఠావు 12×8 అంగుళాలు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవానిని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలను ఏ సందర్భంలోను తిప్పి పంపించడం జరగదు.
8. ప్రచురణకు ఏ కలం పేరో ఉపయోగించినా తమ అసలు పేరును విధిగా వ్రాయాలి.
9. రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.

బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము

పరీధావి దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | ఆగస్టు 28, 1972